# ఆఖరి దశకు అడెల్లి రోడ్డు

- పూర్తయిన ఫార్మేషన్ రహదారి పనులు
- ఇప్పటికే ఆటోలు, ద్విచక్రవాహనాల రాకపోకలు
- త్వరలోనే బీటీ రోడ్డు నిర్మాణం



రఘునాథ్‌పూర్ రాజుల ప్రాంతంలో పూర్తయిన రోడ్డు తవ్వకం పనులు

బోథ్, అక్టోబర్ 22: బోథ్-నిర్మల్ నియోజక వర్గాల మధ్య దూరభారాన్ని తగ్గించేందుకు చేపట్టిన అడెల్లి రోడ్డు నిర్మాణ పనులు ఆఖరి దశకు చేరుకున్నాయి. ఇప్పటికే ఫార్మేషన్ రహదారి పనులు పూర్తికాగా, ద్విచక్రవాహనాలు, ఆటోల లాంటి చిన్న వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. త్వరలోనే బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కానుండగా రెండు నియోజకవర్గ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రఘునాథ్‌పూర్ సమీపంలోని 11వ కిలోమీటర్ నుంచి 17వ కిలోమీటర్ వరకు మిగిలి ఉన్న రోడ్డు నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ. 9.80 కోట్లు మంజూరు చేసింది. పనుల్లో జాప్యం జరిగిన వానకాలం పూర్తికావడంతో ఇటీవల ఊపందుకున్నాయి. ఘాట్ ప్రాంతంలో ఫార్మేషన్ రోడ్డు పనులు చివరి దశకు చేరుకున్నాయి. రాజుల నుంచి ఘాట్ వరకు బీటీ, మధ్యలో సీసీరోడ్డు, నాకాతండా వైపు కింది బాగంలో బీటీ రోడ్డు పనులు చేయాల్సి ఉంది. ప్రస్తుతం రాజుల నుంచి ఘాట్ మీదుగా నాకాతండా రోడ్డు వరకు పనులు పూర్తికావడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, మాక్స్ వాహనాలు వెళ్తున్నాయి. ఘాట్ ప్రాంతంలో ప్రస్తుతం ఎగుడుదిగుడుగా ఉన్న ఫార్మేషన్ రోడ్డుపై మట్టి లేవలింగ్ పనులు నడుస్తున్నాయి. వారం, పది రోజుల్లో ఇవి పూర్తికానున్నాయి. ఫార్మేషన్ రోడ్డు పూర్తి కావడంతో ఈ ప్రాంతంలోని గ్రామాల ప్రజలు సారంగాపూర్, నిర్మల్ తదితర ప్రాంతాలకు ఇటువైపు నుంచే వెళ్తున్నారు. అక్కడి వారు అడెల్లి రోడ్డు మీదుగా వచ్చి వెళ్తున్నారు. మరో రెండు నెలల్లో బీటీ రోడ్డు పనులు పూర్తి చేసేలా రోడ్లు, భవనాల శాఖ అధికారులు పనులు చేయిస్తున్నారు. అడెల్లి రోడ్డు ఎట్టకేలకు పూర్తికావస్తుండడంతో బోథ్, సారంగాపూర్, నిర్మల్ ప్రాంతాల ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు.



నాకాతండా వైపు పూర్తయిన ఫార్మేషన్ రోడ్డు పనులు

## మహాయజ్ఞంలో జాదవ్ అనిల్ పూజలు



మహా యజ్ఞంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్

తాంసి, అక్టోబర్ 22 : మండలంలోని పలు గ్రామాల్లో శారదాదేవీ, దుర్గామాత మండపాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం బండల్‌నాగాపూర్ గ్రామంలో దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా శ్రీ రామాలయంలో వేద పండితుల మంత్రోచ్ఛారణలతో మహాయజ్ఞం నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయగా మహాయజ్ఞంలో ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు తాటిపల్లి రాజు, ఎంపీపీ సురకుంటి మంజులాశ్రీధర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి



బోథ్‌లో ప్రచారం చేస్తున్న జడ్పీటీసీ, నాయకులు

బోథ్, అక్టోబర్ 22 : బీఆర్ఎస్ పార్టీ అమలు చేసిన పథకాలతో ప్రజలకు లబ్ధి చేకూరుతున్నదని జడ్పీటీసీ సంధ్యారాణి అన్నారు. ఆదివారం బోథ్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్‌కు మద్దతుగా నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటేసి అభ్యర్థి జాదవ్ అనిల్‌ను గెలిపించాలని కోరారు. అధికారంలోకి వస్తే గృహలక్ష్మి, రూ 400లకే సిలిండర్, పింఛన్లు, రైతుబంధు పెంపు తదితర అంశాల గురించి వివరించారు. ప్రచారంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ డీ నారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ రుక్మాణ్‌సింగ్, రమణాగౌడ్, రఫీ, సత్యనారాయణ, దేవీదాస్, వెంకటరమణ, బుచ్చన్న, మహిళలు పాల్గొన్నారు.

### 27న భీంపూర్‌లో బీఆర్ఎస్ సభ

భీంపూర్, అక్టోబర్ 22 : మండల కేంద్రంలోని అంగడి మైదానంలో ఈ నెల 27వ తేదీన ఉదయం 10 గంటలకు బీఆర్ఎస్ సభ ఉంటుందని పార్టీ మండల కన్వీనర్ మేకల నాగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. నాయకులు , కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు. గ్రామాల నుంచి రైతులు, మహిళలు, యువత తరలిరావాలని కోరారు.

### చెక్‌పోస్టు వద్ద తనిఖీలు

భీంపూర్, అక్టోబర్ 22 : కరంజి(టీ) అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ఆదివారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్ర నాగాపూరం వైపు నుంచి వచ్చి పోయే వాహనాలు తనిఖీ చేశారు. సర్వైలెన్స్ బృందం వీడియో చిత్రీకరణతో నిఘా కొనసాగిస్తున్నది. ఇక మండల సరిహద్దు పెన్‌గంగ పరీవాహక గుబిడి, అంతర్గాం, వడూర్, గొల్లగడ్, తాంసి(కే) పెన్‌గంగ రేవుల వద్ద కూడా నిఘా ఉంచారు. సీఐ నరేశ్ ఆధ్వర్యంలో ఎస్ఐ లాల్ సింగ్ నాయక్, సిబ్బంది తనిఖీలో పాల్గొన్నారు.

### ఘనంగా కుమ్రం భీం జయంతి

లోకేశ్వరం, అక్టోబర్ 22 : జోహర్‌పూర్‌లో ఆదివారం కుమ్రం భీం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దిగంబర్, ఉప సర్పంచ్ భోజన్న, సుదాన్, గంగన్న, సాయి, నాయక్‌పోడ్ కులస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**తానూర్‌లో..**

తానూర్, అక్టోబర్ 22 : మొగిలి గ్రామంలో కుమ్రంభీం జయంతిని నిర్వహించారు. కుమ్రం భీం చిత్రపటానికి సర్పంచ్ పుండ్లిక్, ఎంపీటీసీ సిరిమెల్ల లక్ష్మణ్ పూలమాలలు వేసి పూజలు చేశారు. మాజీ ఎంపీటీసీ లచ్చన్న, కారోబార్ భుజంగ్‌సింగ్, పడకంటి మోహన్, బాబు పటేల్, నాగ్‌నాథ్, దర్శన్, బాలోడ్ సాయినాథ్, అనిల్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



తానూర్ : మొగిలిలో కుమ్రం భీం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

## దుర్గామాతకు ప్రత్యేక పూజలు



బోథ్ : కరత్వాడలో పూజలు చేస్తున్న ఎంపీపీ తుల శ్రీనివాస్

బోథ్, అక్టోబర్ 22: మండలంలోని కరత్వాడ, పిప్పల్‌ధరి గ్రామాల్లోని మండపాల్లో కొలువుదీరిన దుర్గామాతలకు ఆదివారం ఎంపీపీ తుల శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కే ప్రశాంత్, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు బీ శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీ జుగది రావ్, కొడప విజయ్, డీ గంగయ్య పాల్గొన్నారు.

**బోనాలతో పూజలు**

బోథ్, అక్టోబర్ 22: కౌఠ(బీ) గ్రామంలో దుర్గాదేవీ నవరాత్రోత్సవాలు పురస్కరించుకొని ఆదివారం మహిళలు బోనాలతో పూజలు చేశారు. కొత్తకాలనీలో కొలువుదీరిన దుర్గామండపం వద్ద మహిళలు బోనాలతో శోభాయాత్ర చేపట్టారు. అక్కడి నుంచి శబరిమాత ఆశ్రమం, నవదుర్గ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గమ్మ వద్దకు వచ్చి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో దుర్గా కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు. పార్డి (కే) గ్రామంలో ఆదివాసీ మహిళలు పోచమ్మకు బోనాలు వేశారు.



కౌఠ(బీ)లో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

### దండారీ ఉత్సవాలకు లౌడ్ స్పీకర్ అందజేత

సోనాల, అక్టోబర్ 22 : సోనాల మండలం పెద్దగూడ గ్రామంలో దండారీ ఉత్సవాలకు తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు, బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ ఆదివారం లౌడ్ స్పీకర్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రోహిదాస్, ఈర్ల అఖిల్, తుల హరీశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

### వైభవంగా రామయ్య బ్రహ్మోత్సవాలు



పల్లకీలో రాముడు, సీత, లక్ష్మణుడు విగ్రహాలకు పూజ చేస్తున్న పూజారి

సోనాల, అక్టోబర్ 22 : సోనాలలోని రామాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఎనిమిదో రోజు చంద్రప్రభ వాహనంపై శ్రీరాముల వారిని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు.

### 25 నుంచి సోయా కొనుగోళ్లు

భీంపూర్, అక్టోబర్ 22 : తాంసి సబ్ మార్కెట్ యార్డులో ఈ నెల 25 నుంచి సోయాబీన్ కొనుగోళ్లు ప్రారంభమవుతాయని పీఏసీఎస్ సీఈవో కేశవ్ ఒక ప్రకటనలో తెలిపారు. భీంపూర్, తాంసి మండలాలకు చెందిన రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. రైతులు తమ పట్టాదారు పాస్‌పుస్తకం ,ఆధార్ కార్డు జిరాక్స్ వెంట తీసుకురావాలన్నారు.